క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణంలో పాతమున్సి పాలిటీ కార్యాలయం ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ చైర్మన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్య క్షుడు వీరబొమ్మ రామ్మోహన్ ఒక ప్రకటనలో కోరారు. గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన కోరారు.

చీపునుంతల సీపీఎం నూతన కమిటీ ఏర్పాటు



సీపీఎం గ్రామ కార్యదర్శి కురుమయ్యతో నూతన సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల సీపీఎం నూతన కమిటీ కార్యదర్శిగా గుమ్మడి కురుమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఆదివారం సీపీఎం ఏరియా కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీని ప్రకటించారు. గ్రామ కార్యదర్శిగా గుమ్మడి కురుమయ్య, సభ్యులుగా పోచయ్య, మల్లేశ్, రాజు, ప్రవీణ్, మల్లేశ్‌లను నియమించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అఖిల భారత ఎస్సీ సెల్ అధ్యక్షుడిని కలిసిన అశోక్



రాజేంద్రపాల్ గౌతమ్‌తో అశోక్, నాయిని నరేందర్ తదితరులు

కడ్తాల్: కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని అఖిల భారత కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్, మాజీ సర్పంచ్ నాయిని నరేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు వారు తెలిపారు.

పోచమ్మతల్లి పూజలో మాజీ ఎమ్మెల్యే



పూజలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: గడ్డమల్లయ్యగూడ గ్రామంలో నిర్వహిస్తున్న పోచమ్మ తల్లి ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసేలా, ప్రజలను సంతోషంగా ఉంచేలా, పసిడి, పంటలతో సస్యశ్యామలంగా ఉండేలా చూడాలని మొక్కుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల పండుగ



శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్‌లో ఉట్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని వీధుల గుండా ఊరేగించి.. హనుమాన్ దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికావు

షాద్‌నగర్‌రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకులను విస్మరించి కేవలం ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఎండీ.ఇబ్రహీం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవడం విస్మరించి ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం తగదని పేర్కొన్నారు.

వైభవంగా బోనాలు

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు
- హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లులో గౌడసంఘం నిర్వహించిన ఊరేగింపులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: బోనాల ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలోని కొంగరకలాన్‌లో ఊరేగింపు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం గౌడసంఘం ఆధ్వర్యంలో కాటమయ్యస్వామి, పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని కాటమయ్య దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు తమ తమ ఇళ్ల నుంచి బోనం కుండలతో ఊరేగింపుగా వచ్చి కాటమయ్యస్వామి, పోచమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ యాట గీత, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, కాటమయ్య దేవాలయ కమిటీ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, గౌడసంఘం నాయకులు గంగారవీందర్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, బాలకృష్ణగౌడ్, చుక్క నిరంజన్‌గౌడ్, కుమార్‌గౌడ్, సతీశ్, నరేశ్, నర్సింహా, అల్లాజీ, రాఘవేందర్‌గౌడ్, శివ, శ్రీను హరినాద్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి లింగరావ్‌పల్లిలో ముత్యాలమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో కల్వకుర్తి ఎమ్మెల్యే, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ,పెద్దమ్మ, బీరప్ప, మడేలు స్వామి ఆలయంలో..

కడ్తాల్: మండల కేంద్రంలో ఈదమ్మ,పెద్దమ్మ, బీరప్ప, మడేలు స్వామి బోనాలు ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మహిళలు రంగు రంగులతో పసుపు కుంకుమలతో బోనం కుండలను అలంకరించుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుతో వెళ్లారు. అనంతరం అక్కడ నైవేద్యం, తీపి వంటకాలను అమ్మవార్లకు, స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈదమ్మ ఆలయంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పూజలు

వడ్డెర కులస్తుల ఆరాధ్య దైవం ఈదమ్మ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వేర్వేరుగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను, మాజీ ఎమ్మెల్యేను, ఇతర నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం మండల గౌరవ అధ్యక్షుడు వడ్డెరాజు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, పీసీబీ మెంబర్ బాలాజీసింగ్, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, రాంచందర్, జహంగీర్, భిక్షపతి, రాజేశ్, గంప శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంలో బోనాలు నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆట, పాటలతో అమ్మవార్లను ఊరేగించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు, దరువులతో సందడి చేశారు.

● అధ్వానంగా అంతర్గత రోడ్లు



ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో రోడ్డుపై చేరిన నీరు

పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ గుంతలమయంగా తయారై, బురదమయమవుతున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నప్పటికీ మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఆయా కాలనీల్లో కాల్వలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై, ఇళ్లమధ్య ఖాళీ స్థలాల్లో చేరి దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – ఆమనగల్లు



నదీమ్‌నగర్‌లో వెలుగుతున్న విద్యుత్ దీపం



బాకారంలో వెలుగుతున్న విద్యుత్ దీపం

పట్టపగలు వెలుగులు

మొయినాబాద్‌రూరల్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని.. ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతూనే ఉంది. రాత్రి సమయాల్లో గ్రామాల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు కొన్నింటికి స్విచ్‌లు ఉన్నా బంద్ చేయకపోవడంతో కరెంటు ఉన్నంతసేపు వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని నదీమ్‌నగర్, బాకారం గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధిదీపాలు ఎప్పుడూ వెలుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విద్యుత్ దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మధుసూదన్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గంప జాతర

చేవెళ్ల: పట్టణంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసంలో నిర్వహించే గంప జాతర సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకుడు దేవునివామనచార్యులు తెలిపారు. చేవెళ్లలోని బాలా జీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసంలో వచ్చే చివరి సోమవారం గంప జాత ర కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. భక్తులు ఉదయం ఆలయానికి వచ్చి రోజంతా ఆలయంలోనే దైవసన్నిధిలో ఉంటూ వంటావార్పులతో ఆలయ పూజల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వర కు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని, సాయ ంత్రం గరుడవాహన సేవ ఉత్సవం ఉంటుందని తెలిపారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని నియమించండి

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని ఏబీవీపీ చేవెళ్ల టౌన్ సంయుక్త కార్యదర్శి కె.వివేకానందరెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటంతో విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థుల సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. విద్యావ్యవస్థ పటిష్టతకు, మెరుగైన సౌకర్యాల కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరినట్లు స్పష్టం చేశారు. విద్యారంగాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఆయన సానుకులంగా స్పందించి తప్పకుండా ప్రభుత్వానికి సూచిస్తామని చెప్పారన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో బాగ్యరి అంజయ్య మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయంను మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో షెక్ హుస్సేన్, దశరథ, సత్యం, చైతన్య, మాధవ, సాయి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విధిగా నేర్చుకోవాలి

షాద్‌నగర్: విద్యార్థులు విధిగా కరాటే నేర్చుకోవాలని మాస్టర్ సాయినాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ థియేటర్ ఆవరణలో యాదవ బూడోఖాన్ కరాటే క్లబ్‌వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో షాద్‌నగర్, శంషాబాద్ బ్రాంచ్‌లకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. మాస్టర్లు నరేందర్‌నాయక్, ఉత్తేజ్, గోపి, వినయ్, రాహుల్, శ్రీను, చరణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం లింగరావ్‌పల్లి గ్రామానికి చెందిన మట్టరాజు ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొంది ఆర్థికసాయం కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.40వేల చెక్కును ఆదివారం లింగరావ్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మట్ట రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకురు ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు కాడమోని శ్రీశైలం, తిరుపతయ్య, మణికంఠ, యాదయ్య, జోగు రమేశ్, శ్రీశైలం, జలందర్‌రెడ్డి, రాములు, వెంకటయ్య, కృష్ణయ్య, రమేశ్, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీల అమలులో విఫలం



బీఆర్ఎస్‌లో చేరిన పలువురు యువకులు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం ఆరుట్ల గ్రామంలో బుగ్గ తండాకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకంలేదన్నారు. అందులో భాగంగానే బుగ్గ తండాకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ నాయకుడు మాడ్గుల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాట్రోత్ వెంకటేశ్, ప్రవీణ్, హరికిషన్, బాలాజీ, బలరాం, మహేశ్, ఉదయ్ కిరణ్, వినోద్, హన్మంత్, కె, మోహన్, కుమార్, హరి, సపావట్ ప్రవీణ్, వినోద్, రజినీకాంత్, నర్సురాం, రామావత్ మోహన్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పున్నం రాము, నాయకులు చిందం రఘుపతి, నూతన గంటి శేఖర్, లాలగారి జంగయ్య, వినోద్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

- టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి
- మేడిగడ్డలో మొబైల్ హెల్త్‌క్యాంపు ప్రారంభం



మేడిగడ్డ తండాలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజక వర్గ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. ప్రతీ గ్రామంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్‌క్యాంప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, వివిధ రక్త పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. 2028 నాటికి లక్ష మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా వన్ మెడి హబ్ సంస్థ సహకారంతో ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్యాంపులో లివర్, కిడ్నీ, గుండె, కొలెస్ట్రాల్, కాల్షియం, షుగర్ తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు మల్లేశ్‌నాయక్, పురుషోత్తం, చంద్రునాయక్, కృష్ణ, కుమార్, మల్లేశ్, నవీన్, తావునాయక్, టాక్యా, సక్రియ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

హాజరైన జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్



మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్, వీరశైవ సంఘ నేతలు

ఇబ్రహీంపట్నం: భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, నేత్ర పర్వంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం దేవాలయ కమిటీ చైర్మన్ శెట్టి శివకుమార్, అధ్యక్షుడు మాయిని ఆనందప్ప, ప్రధాన కార్యదర్శి పట్నంశెట్టి విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి..

జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్ ఈ కల్యాణోత్సవానికి హాజరై మాట్లాడారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజలను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం పలువురు వీరశైవ మహిళలు రాఖీ కట్టి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, కోశాధికారి రాచప్ప, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షుడు మిరియనం అనిల్, సోమశేఖర్, ధన్వాడ శివకుమార్, పాగాకు మల్లప్ప, దీరేశప్ప, నెల్లి కుమార్, కర్రె శశిధర్, అశోక్, మాయిని రమేశ్, ముత్యాల అనిల్, తిరుమల, ఫణి, కర్నె అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



షాబాద్: మాట్లాడుతున్న సీఐ కాంతారెడ్డి



మొయినాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

షాబాద్: రానున్న వినాయక చవితి ఉత్సవాలను కులమతాలకతీతంగా శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వ్యవహరించాలన్నారు. మండపాల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో తమకు తెలియని విషయాలను ఇతరులకు పంపొద్దన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ మంచి వారికే వర్తిస్తుందని, చెడువారికి అసలు వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్‌కుమార్, శంకర్‌రెడ్డి, ఏఎస్ఐ రామ్‌లాల్, పోలీస్ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

అనుమతి తప్పనిసరి

మొయినాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయన నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని.. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని.. డీజే సౌండ్ పెట్టొద్దని సూచించారు. ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.